
సాక్షి
పల్నాడు
మంగళవారం । 24 । డిసెంబర్ । 2024



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 1902 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1410 క్యూసెక్కులు వదిలారు.



అమరేశ్వరుని సేవలో ఎస్పీ

అమరావతి: అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరుని సోమవారం ఎస్పీ కంచి శ్రీనివాసరావు కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 576.30 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,298 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

పెరిగిన సత్రశాల ఆదాయం



రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద ఉన్న పురాతన గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం ఆదాయం గత ఏడాది కన్నా పెరిగినట్టు దేవదాయ శాఖ సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ వి.లీలావతి, దేవస్థానం ఈఓ గాదె రామిరెడ్డి తెలిపారు. సోమవారం సత్రశాల దేవస్థానంలో హుండీ లెక్కించగా రూ.4,42,500 వచ్చినట్లు వివరించారు. గత ఏడాది రూ.3,69,000 రాగా ప్రస్తుతం రూ.73,500 అధికంగా ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. స్థానిక శివాలయంలో కార్తీకమాసంలో హుండీ ఆదాయం రూ.11,388 వచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో రెంటచింతల శివాలయం చైర్మన్ పల్లెర్ల లక్ష్మారెడ్డి, గుండా శివయ్య, మున్నా లింగయ్య, నీలం మల్లయ్య, అర్చకులు పాల్గొన్నారు.

సమగ్రశిక్షలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి పోస్టులో ఫారిన్ సర్వీసు నిబంధనలపై డెప్యూటేషన్‌పై పని చేసేందుకు ఆసక్తి, అర్హతలు గల ఉపాధ్యాయులు ఈనెల 31లోపు దరఖాస్తు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న 55 ఏళ్లలోపు వయసు కలిగిన ఉపాధ్యాయులకు మాథ్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టుల్లో పీజీతోపాటు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి పీజీడీసీఏ, డీసీఏ డిప్లొమా ఉండాలని సూచించారు. విద్యార్హతల జిరాక్స్ కాపీలతో ఈనెల 31వ తేదీలోపు డీఈవో కార్యాలయంలోని సమగ్రశిక్ష విభాగంలో సమర్పించాలని, పూర్తి వివరాలకు సమగ్రశిక్ష గుంటూరు.బ్లాగ్‌స్పాట్.కామ్ సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

యార్డుకు 65,687 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 65,687 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 60,866 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.14,800 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 16,000 వరకు లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 49,236 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

నేడు మున్సిపల్ టీచర్స్ ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని నగరపాలక సంస్థ, పురపాలక పాఠశాలల్లో పని చేస్తున్న ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు మంగళవారం ఉదయం 11 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీఈవోజీఎన్‌టీ.బ్లాగ్‌స్పాట్.కామ్ వెబ్‌సైట్‌లో ఉంచిన సీనియార్టీ జాబితాలో పొందుపర్చిన ఉపాధ్యాయులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీస్ రిజిస్టర్‌తో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు.

ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు మెడికల్: జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్, జాతీయ టీబీ నిర్మూలన కార్యక్రమంలో కాంట్రాక్టు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. డాట్ ప్లస్ టీబీ హెచ్ఐవీ సూపర్‌వైజర్ పోస్టు ఒకటి, టీబీ సెంటర్ స్టాటిస్టికల్ అసిస్టెంట్ పోస్టు ఒకటి, అకౌంటెంట్ పోస్టు ఒకటి, టీబీ హెచ్‌డీ ఎస్‌జీఓ పోస్టులు మూడు, డిస్ట్రిక్ ప్రోగ్రామ్ పోస్టు ఒకటి ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ దరఖాస్తు ఫారం, జీతాలు, ఇతర వివరాలకు గుంటూరు.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు. దరఖాస్తులను ఈనెల 24 నుంచి జనవరి 5 వరకు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా టీబీ అధికారిణిని 778058 2555 నంబరులో సంప్రదించాలన్నారు.

▸ చిలకలూరిపేటకు చెందిన ఓ కుటుంబం కొద్ది రోజుల్లో పండుగ ఉందని కొత్త దుస్తులు తీసుకొచ్చేందుకు చీరాల వెళ్లింది. దుస్తులు తీసుకుని భార్య కుమారుడితో బైక్‌పై చిరునవ్వులు చిందిస్తూ ఇంటి ముఖం పట్టారు. ఇంతలో మృత్యువు రూపంలో వచ్చిన ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో 13 ఏళ్ల బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. ఆ ఇల్లాలి గుండెల నిండా వేదనాశ్రువులు నిండిపోయాయి.

▸ ‘అమ్మా.. ఇక్కడ బయలుదేరాను.. సాయంత్రానికి ఇంట్లో ఉంటాను బై అమ్మా’ అని చెప్పిన కొడుకు.. ఇంటికి రాకముందే గుండెలు పగిలే విషాద వార్త తెలుపుతట్టింది. నరసరావుపేట పట్టణానికి చెందిన యువకుడు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తూ వీకెండ్‌లో స్వగ్రామానికి బయలుదేరాడు. బైక్‌పై వస్తుండగా మార్గమధ్యంలో వాహనం అదుపుతప్పి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మరణించాడు. తల్లిదండ్రులకు నూరేళ్లకు సరిపడా వేదన మిగిల్చాడు.

▸ ఈ రెండు కేసుల్లో ప్రధానంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, హెల్మెట్ ధరించకపోవడం వల్లే నిండు ప్రాణాలు బలయ్యాయి. అందుకే ట్రాఫిక్ నియమ, నిబంధనల అమలును సుప్రీం కోర్టు సీరియస్‌గా పరిగణించింది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్రాఫిక్ ఉల్లంఘనులపై కొరడా ఝుళిపిస్తున్నాయి. నిబంధనలు మీరితే భారీ జరిమానాలు విధించేందుకు సిద్ధమయ్యాయి.

రూల్స్ మీరితే చల్తానై..!

గీత దాటితే మోతే..

- భారీగా ట్రాఫిక్ చలానాల పెంపు
- నిబంధనల ఉల్లంఘనపై కొరడా
- సుప్రీం ఆదేశాలతో ప్రభుత్వాల్లో కదలిక
- జరిమానాలపై దృష్టి సారించిన పోలీస్ యంత్రాంగం
- రోడ్డు ప్రమాదాల నివారణకే చర్యలు
- ఈ ఏడాది 758 రోడ్డు ప్రమాదాలు
- 380 మంది మృత్యువాత



ట్రాఫిక్ సిగ్నల్ ఉల్లంఘించి మూడు మార్గాల నుంచి ఒకేసారి వస్తున్న వాహనాలు

నరసరావుపేటటౌన్: రాష్ట్రంలో ఏటా రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన వారి సంఖ్య పెరిగిపోతూ ఉంది. ఈ ప్రమాదాల్లో అధిక శాతం హెల్మెట్ ధరించకపోవడం, ట్రాఫిక్ నియమాలు పాటించకపోడం వల్లనే జరుగుతున్నాయి. ఆదివారం వినుకొండలో బైక్‌పై వస్తున్న అన్నాదమ్ములను కారు ఢీకొంది. ఘటనలో అన్న మృతి చెందగా, తమ్ముడికి తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ద్విచక్ర వాహనంపై వస్తున్న ముగ్గురిని నడికుడి శివారులో మినీ లారీ ఢీకొంది. ఘటనలో గురజాలకు చెందిన రామారావు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ రెండు ఘటనలు ఒకే రోజులో జరిగాయి. పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది సుమారు 758 రోడ్డు ప్రమాద కేసులు నమోదు కాగా, వీటిల్లో 380 మంది మృత్యువాత పడ్డారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోనూ ఈ కేసులు అధికంగా ఉన్నాయి. రోడ్డు ప్రమాదాల్లో కొందరు మృత్యువాత పడితే, మరి కొందరు దివ్యాంగులుగా మారుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ట్రాఫిక్ చలానాలను విపరీతంగా పెంచేసింది.

సిబ్బంది కొరత

పోలీసు శాఖను సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. గత ప్రభుత్వంలో కానిస్టేబుల్, ఎస్‌ఐ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నా ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో కోడ్ అడ్డుగా నిలిచింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడు నెలలు కావస్తున్నా కానిస్టేబుళ్లు, ఎస్‌ఐ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం ఉన్న సిబ్బంది బందోబస్తు, ప్రొటోకాల్ వంటి డ్యూటీలు అధికంగా ఉండటంతో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ-చలానా పెండింగ్ ఉంటే వాహనం సీజ్



ప్రతిఒక్కరూ విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలి. ఈ-చలానాలు పెండింగ్ ఉంటే వెంటనే చెల్లించాలి. లేకుంటే వాహనాలను సీజ్ చేస్తాం. రోజూ ప్రధాన కూడళ్లలో తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధిస్తున్నాం. అయినా వాహనదారుల్లో మార్పు రావటంలేదు. ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవటం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. విషయాన్ని గుర్తెరిగి ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించండి.
– సి.హెచ్.లోకనాథం, ట్రాఫిక్ సీఐ

పెంచిన జరిమానాలు ఇలా(రూపాయల్లో)..

మీరిన నిబంధన	గతం	ప్రస్తుతం
హెల్మెట్, సిగ్నల్ ఉల్లంఘన,	100	500
అథారిటీ ఆదేశాల ధిక్కరణ	500	5,000
లైసెన్స్ లేని డ్రైవింగ్	500	5,000
అతివేగం	400	1,000
ప్రమాదకర డ్రైవింగ్	1,000	5,000
డ్రంక్ అండ్ డ్రైవ్	2,000	10,000
రేసింగ్ అండ్ స్పీడ్	500	5,000

(ఈ జరిమానాల అమలుపై పోలీసు యంత్రాంగం ఇప్పటికే దృష్టి సారించింది. రోజూ తనిఖీలు నిర్వహించి చలానాలు రాయటం ముమ్మరం చేశారు.)



హెల్మెట్ లేకుండా పరిమితికి మించి ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న కుటుంబం

27న జాబ్‌మేళా

చిలకలూరిపేట: ఏపీ నైపుణాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 27న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు తెలిపారు. పట్టణంలోని రాగన్నపాలెంలో ఉన్న కమ్యూనిటీ హాలులో ఈ జాబ్‌మేళా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, పీజీ చదువుకున్న 18 నుంచి 50 సంవత్సరాలలోపు వారు హాజరు కావచ్చన్నారు. జాబ్‌మేళాకు వచ్చేవారు వారి విద్యార్హత ధ్రువీకరణ పత్రాల కాపీలు, ఆధార్ నకలు, పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకురావాలన్నారు. హెటిరో డ్రగ్స్ లిమిటెడ్, వసంత టెక్స్‌టైల్స్ వంటి కంపెనీలు హాజరు అవుతాయని, విద్యార్హతను బట్టి రూ.10వేల నుంచి రూ.25వేల వరకు జీతం ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 91005 66581, 91602 00652 నంబర్లలో సంప్రదించాలన్నారు.


31లోగా ఓపెన్ స్కూల్ ఫీజు చెల్లించాలి

నరసరావుపేట ఈస్ట్: సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా 2025 మార్చి నెలలో జరగనున్న పదవ తరగతి, ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే అభ్యాసకులు ఈనెల 31వ తేదీలోగా ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సోమవారం తెలిపారు. అపరాధ రుసుం రూ.25తో జనవరి 4వ తేదీలోపు, రూ.50 అపరాధ రుసుంతో జనవరి 8 వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. అలాగే తత్కాల్ ఫీజు రూ.వెయ్యితో ఇంటర్మీడియెట్, రూ.500తో పదవ తరగతి ఫీజును జనవరి 9, 10 తేదీలలో చెల్లించవచ్చని వివరించారు. పదవ తరగతి అభ్యాసకులు థియరీ సబ్జెక్టుకు రూ.100, ఇంటర్మీడియెట్‌కు రూ.150, ప్రాక్టికల్ పరీక్షకు సబ్జెక్టుకు రూ.100 చొప్పున ఫీజు చెల్లించాలని తెలిపారు. అభ్యాసకులకు బెటర్‌మెంట్ రాసే అవకాశం కూడా ఉందని స్పష్టం చేశారు. అభ్యాసకులు తమ సమీపంలోని ఓపెన్ స్కూల్ కేంద్రాలు, లేదా జిల్లా పరీక్షల విభాగంలోనూ సంప్రదించాలని సూచించారు. పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్ www.apopenschool.ap.gov.in ద్వారా టైం టేబుల్ పొందవచ్చని స్పష్టం చేశారు.


రోళ్లు సైతం పగిలే ఎండలకు నిలయమైన రెంటచింతల మండే గుండెల్లోనూ ప్రేమ వర్షం కురిపించే క్రైస్తవ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. పురాతన చలువ రాతి మందిరాల్లో క్రీస్తు చల్లని దీవెనలు నిరంతరం కురుస్తున్నాయి. ఇక్కడ శతాబ్దాల క్రితం నిర్మించిన చర్చిలు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఏసు సేవలో తరిస్తున్నాయి. ప్రేమపూర్వక బోధనలతో మార్మోగుతున్నాయి. జయజయ యేసు జయక్రీస్తు అంటూ నినదిస్తున్నాయి.

భక్తిభావం.. ప్రేమ‘పూర్వ’కం

శతాధిక వసంతాల చర్చిలు కేరాఫ్ రెంటచింతల



పురాతన కానుకమాత చర్చి



ఆంధ్రా ఇవాంజెలికల్ లూథరన్ చర్చి

- క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన ప్రార్థనాలయాలు
- చలువరాతి మందిరాల్లో చల్లని దీవెనలు

రెంటచింతల: క్రిస్మస్ వేడుకలకు మండలంలోని పలు చర్చిలు ముస్తాబయ్యాయి. రంగురంగుల విద్యుద్దీప కాంతుల్లో మెరిసిపోతున్నాయి. మండల కేంద్రంలో కొలువైన పురాతన కతోలిక మందిరాలూ క్రిస్మస్ దివ్య వేడుకలకు సిద్ధమయ్యాయి. ఈ ఆలయాలు ఎన్నో విశిష్టతల సమాహారంగా విరాజిల్లుతున్నాయి. 174 ఏళ్ల క్రితం 1850లో నిర్మించిన కానుకమాత చర్చిలో అడుగుపెట్టగానే చలువ రాయి చల్లదనం మనసును మైమరిపింపజేస్తుంది. కానుకమాత దివ్యమంగళ స్వరూప దర్శనంతో మది పులకిస్తుంది. క్రీస్తు శిలువ వేసే సమయంలో పడిన శ్రమలను గుర్తుచేసే 14 ఘట్టాలతో కూడిన రాతి కట్టడాలు అమితంగా ఆకట్టుకుంటాయి. ప్రస్తుతం ఈ చర్చిలో క్రిస్మస్ సందడి నెలకొంది. కానుకమాత చర్చి విచారణ గురువులు ఏరువ లూర్దుమర్రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

అరుదైన ప్రత్యేకతల నిలయం లూథరన్ చర్చి

121 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన లూథరన్ చర్చి అరుదైన ప్రత్యేకతల నిలయం. చలువ రాతితో నిర్మించిన ఈ మందిరంలో ఎత్తైన 2 టవర్లు ఉన్నాయి. మోగిస్తే 8 కిలోమీటర్ల పరిధి వరకు వినిపించే 400 కిలోల బరువైన పంచలోహ గంట సందర్శకులను అబ్బురపరుస్తుంది. జర్మనీ దేశం నుంచి తీసుకు వచ్చిన ఏసుక్రీస్తు ప్రతిమలు, పురాతన బాప్టిజం తొట్టె, ఇత్తడి శిలువలు ఆకట్టుకుంటాయి. భక్తిభావాన్ని పెంపొందిస్తాయి. 1903లో జర్మనీ దొర ఆల్బర్ట్ జార్జి ఈ ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ చర్చి నిర్మాణాన్ని చేపట్టారు. సుమారు తొమ్మిదేళ్లపాటు నిర్మాణ పనులు జరిగాయి. 1912 జూన్ 15 నుంచి ఇక్కడ ప్రార్థనలు జరుగుతున్నాయి. 7,090 మీటర్ల ఎత్తైన రెండు టవర్లతో నిర్మించిన ఈ చర్చిలో 1923 వరకు జర్మనీ దేశస్తులు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. 1924 నుంచి ఇప్పటివరకు జాతీయ గురువులైన రెవరెండ్ ఆర్డీపీ అగస్టీన్ మొదలుకుని ప్రస్తుత ఫాదర్ డేగల దేవానందం వరకు 24 మంది పాస్టర్లు సువార్త పరిచర్య చేస్తూ వచ్చారు. ఇటీవల వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తన సొంత నిధులు రూ.25 లక్షలతో ఈ చర్చి పునర్నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేశారు.

విద్యుత్ చార్జీలపై ప్రజల పక్షాన పోరుబాట

- పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే విరమించుకోవాలి
- ప్రజలను మోసం చేసిన సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం
- చార్జీలు తగ్గించేంతవరకు వైఎస్సార్ సీపీ పోరాటం ఆగదు
- ఈనెల 27న జిల్లా వ్యాప్తంగా ఆందోళన
- ప్రజలపై రూ.15,484 కోట్ల మేర విద్యుత్ భారం మోపిన కూటమి సర్కారు
- వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి ధ్వజం
- హైదరాబాద్‌లో పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ




వైఎస్సార్ సీపీ పోరుబాట పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి, నాయకులు

నరసరావుపేట: విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన నారా చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టాక మాట తప్పారని, వెంటనే పెంచిన చార్జీలను విరమించుకోవాలని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. కరెంటు చార్జీల బాదుడుపై ఈనెల 27న నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ పోరుబాట పోస్టర్‌ను సోమవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో పిన్నెల్లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తాను అధికారంలోకి వచ్చిన వెంటనే చార్జీలను తగ్గిస్తానని, వినియోగదారులే కరెంటు అమ్మేలా చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పులివెందుల, కడప, టీడీపీ మహానాడు, పెద్దాపురం, వైజాగ్‌లో విజన్ డాక్యుమెంట్ విడుదల సందర్భంగా బూటకపు వాగ్దానాలు చేశారని పిన్నెల్లి ధ్వజమెత్తారు. ఆరునెలలు తిరగకుండానే జనంపై చార్జీల భారం మోపారని విమర్శించారు. విద్యుత్ చార్జీలు నవంబరులో రూ.6,072 కోట్లు, డిసెంబరులో రూ.9,412 కోట్లు పెంచి మొత్తం కలిపి రూ.15,484 కోట్ల భారం ప్రజల నెత్తిన మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ హామీలు గాలికొదిలేసిన బాబు చార్జీలు పెంచడం సమంజసం కాదని పేర్కొన్నారు. 2000 సంవత్సరంలో విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా ఉద్యమం చేసిన వారిపై పోలీసుల చేత కాల్పులు జరిపించి ప్రాణాలు బలిగొన్న రాక్షసుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. 2014 నాటికి డిస్కంలు రూ.29 వేల కోట్ల అప్పుల్లో ఉంటే 2019 నాటికి వాటిని రూ.86వేల కోట్లకు చేర్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతోందని ఎద్దేవా చేశారు. డిస్కంలను ఆదుకునేందుకు చంద్రబాబు చేసిన సహాయం రూ.13,255 కోట్లు అయితే, వైఎస్సార్ సీపీ హయాంలో రూ.47 వేల కోట్లు డిస్కంలకు అందించి చేయూత ఇచ్చినట్టు పిన్నెల్లి గుర్తుచేశారు. టీడీపీ హయాంలో డిస్కంలు చేసుకున్న ఒప్పందంతో పవన విద్యుత్ ధర రూ.4.70ల నుంచి రూ.4.84 వరకు ఉందని, వైఎస్సార్ సీపీ హయాంలో సెకీతో ఒప్పందం వల్ల ధర రూ.2.49లకు తగ్గిందని వివరించారు. దీంతో వచ్చే 25 ఏళ్లల్లో రాష్ట్రానికి రూ.లక్ష కోట్లు ఆదా కానుందని పేర్కొన్నారు.

మెటీరియల్ ‘టెన్’షన్!

- పదో తరగతి విద్యార్థులకు ఇంకా అందని స్టడీ మెటీరియల్
- డిసెంబర్ ముగుస్తున్నా చలనం లేని పాలకులు, అధికారులు
- 2022లో తొలిసారిగా జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ
- ఈసారి నవంబర్ 2న జెడ్పీకి మెటీరియల్ అందజేసిన విద్యాశాఖ
- టెండర్ల ఖరారు, ముద్రణలో జెడ్పీ పాలకుల తీవ్ర నిర్లక్ష్యం



జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ (ఫైల్)

గత రెండేళ్లు మెటీరియల్ పంపిణీ ఇలా..

సంవత్సరం	అందుకున్న విద్యార్థులు	ఖర్చుచేసిన మొత్తం(రూ.లక్షల్లో)
2022	36,155	61.80
2023	39,000	70.00

విద్యార్థులు నష్టపోతున్నారు

టెన్త్ విద్యార్థులకు డిసెంబర్ 15లోపు స్టడీ మెటీరియల్ ఇస్తామని హామీ ఇచ్చిన జెడ్పీ పాలకవర్గం, అధికారులు ఆచరణలో విఫలమయ్యారు. జనవరిలో ఇచ్చినా, స్టడీ మెటీరియల్ ఆధారంగా పరీక్షలకు సన్నద్ధం కావడం విద్యార్థులకు సాధ్యపడదు. వెంటనే ఇచ్చే ఏర్పాట్లు చేయాలి.
– కేఎస్ లక్ష్మణరావు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సకాలంలో స్టడీ మెటీరియల్ అందించడంలో జెడ్పీ పాలకవర్గం, అధికార యంత్రాంగం విఫలమైంది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులతో అధిక మార్కుల సాధనకు దోహదం చేసేలా రూపొందించిన మెటీరియల్‌ను విద్యాశాఖాధికారులు గత నవంబర్ 2న జెడ్పీ పాలకవర్గానికి అందజేసినా, ఇప్పటికీ కనీసం ముద్రణకు నోచుకోలేని దుస్థితి నెలకొంది. స్టడీ మెటీరియల్ పంపిణీలో నెలకొన్న జాప్యంపై ఇటు పాలకవర్గం, అటు అధికారులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు.

వైఎస్ జగన్ పాలనలో రెండేళ్లపాటు నిరాటంకంగా..

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో వరుసగా రెండేళ్లు ‘జగనన్న విద్యాజ్యోతి’ పేరుతో స్టడీ మెటీరియల్ రూపొందించి సకాలంలో పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేసిన జెడ్పీ పాలకవర్గం కూటమి ప్రభుత్వ పాలనలో తొలి ఏడాదే చతికిలబడింది. 2022 నవంబరులో రూ.61.80 లక్షల జెడ్పీ నిధులతో రాష్ట్రంలోనే తొలిసారిగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 36,155 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. 2023లోనూ రూ.70 లక్షల వ్యయంతో 39వేల మంది విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేశారు. ప్రస్తుతం టెన్త్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న 35వేల మంది విద్యార్థులకు రూ.70 లక్షల ఖర్చుతో స్టడీ మెటీరియల్ పంపిణీకి గత జెడ్పీ సర్వసభ్య సమావేశంలోనే నిర్ణయించినా ఆచరణలోకి రాలేదు. మార్చి 17 నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలకు షెడ్యూల్ విడుదలైంది. విద్యాశాఖ రూపొందించిన మెటీరియల్‌ను నవంబర్ 2న జెడ్పీకి అందించినా టెండర్లను పిలిచి, ముద్రణ చేయించడంలో జెడ్పీ పాలకవర్గం, అధికార యంత్రాంగం విఫలమయ్యాయి.

క్లుప్తంగా

పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జీల పదవీ కాలం పొడిగింపు



రొంపిచర్ల: జిల్లాలోని 59 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (ప్యాక్స్)కు ప్రభుత్వం అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జీల పదవీ కాలాన్ని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పల్నాడు జిల్లాలో 60 ప్యాక్స్ ఉండగా 59 ప్యాక్స్‌లకు పీఐసీలను నియమించారు. సహకార శాఖలో పనిచేస్తున్న అధికారులనే ప్యాక్స్‌కు పీఐసీలుగా నియమించారు. ఈ మేరకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఉదయగిరి నాగశ్రీనివాస్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నియామకాలు ఆరు నెలల పాటు లేదా ఎన్నికలు జరిగే అంతవరకూ కొనసాగుతాయని తెలిపారు.

పాత కక్షల నేపథ్యంలో యువకుడిపై దాడి



సత్తెనపల్లి: పాత కక్షల నేపథ్యంలో యువకుడిపై దాడి జరిగిన సంఘటన పట్టణంలోని ముస్లిం పాలెం చాపల సత్తార్ వీధిలో సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు జరిగిన గొడవలను దృష్టిలో పెట్టుకొని ముస్లింపాలేనికి చెందిన షేక్ రఫీ అనే యువకుడి పై అధికార పార్టీకి చెందిన యువకులు దాడికి పాల్పడ్డారు. మారణాయుధాలతో దాడి చేయడంతో రఫీకి భుజం, కంటి పైన గాయాలై రక్తస్రావమైంది. క్షతగాత్రుడు రఫీని హుటాహుటిన స్థానికులు సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. భుజంపై బలమైన గాయం కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు బాధితుని బంధువులు తెలిపారు. పట్టణ పోలీసులు వైద్యశాలకు చేరుకొని గాయాల పాలైన రఫీతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు.

మోసపోయాం.. న్యాయం చేయండి

- జిల్లా పోలీసు కార్యాలయ పీజీఆర్ఎస్‌కు 63 ఫిర్యాదులు
- స్వీకరించిన జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు



ఎస్పీని కలిసి సమస్యలు చెప్పుకుంటున్న బాధితులు

నరసరావుపేట: మోసగాళ్ల పట్ల ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు ఎస్పీ శ్రీనివాసరావు అధ్యక్షత వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారిచే 63 ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కోరారు. జిల్లా అదనపు ఎస్పీ జేవీ సంతోష్, లా అండ్ ఆర్డర్ అదనపు ఎస్పీ సీహెచ్.లక్ష్మీపతి పాల్గొన్నారు.

బ్యాంకు మేనేజర్‌పై చర్యలు తీసుకోండి

ఎస్ఎస్ ఎడ్యుకేషనల్ సొసైటీలో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పనిచేస్తూ ఆ సంస్థ బ్యాంక్‌ఖాతా కోసం ఏప్రిల్‌లో అకౌంట్ ఓపెనింగ్ కోసం నరసరావుపేట పట్టణంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఆర్ఎంగా పనిచేస్తున్న ఎస్.రఘురాంను కలిశాను. ఖాతా తెరిచేందుకు సొసైటీ రిజిస్ట్రేషన్, సొసైటీ పాన్ కార్డ్, సొసైటీ బైలాస్, డిపాజిట్ రూ.5లక్షలు, ఖాళీ చెక్కులు కావాలని కోరాడు. అవన్నీ ఇచ్చాను. అకౌంటు ఓపెన్ అయిందని రఘురాం సమాచారం ఇచ్చారు. కానీ రూ.5లక్షలు ఆ ఖాతాలో డిపాజిట్ కాలేదు, దీని గురించి గట్టిగా అడగ్గా, నన్ను ఇబ్బంది పెట్టేందుకు నాపై ఫిర్యాదు చేస్తే మీ సంస్థ గురించి నెగిటివ్‌గా రాసి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తున్నాడు. రూ.5లక్షలు తీసుకొని ఉద్దేశపూర్వకంగా మోసం చేసి అడిగితే బెదిరిస్తున్న అతనిపై చర్యలు తీసుకొని నాకు రక్షణ కల్పించండి.

– ముప్పాళ్ల కోటేశ్వరరావు, ఆరేపల్లి ముప్పాళ్ల, ఈపూరు మండలం

లోన్ కంపెనీ నిర్వాహకులపై చర్యలు తీసుకోండి

నేను 2023 మే నెలలో ఐసీఎఫ్ కార్పొరేషన్ కంపెనీ ఇచ్చిన జాబ్ రిక్రూట్‌మెంట్ పేపర్ యాడ్ చూసి దరఖాస్తు చేశాను. నన్ను మార్కెటింగ్ అసోసియేటర్‌గా జాబులోకి తీసుకున్నారు. పది మంది నుంచి రుణం ఫైల్ చేయాలని లక్ష్యం నిర్దేశించారు. కంపెనీ చెప్పిన విధంగా ఐదు శాతం వడ్డీతో రుణం ఇచ్చేలోగా పదిమంది దరఖాస్తులు కంపెనీ వారికి పంపాను. నాకు తెలియకుండా వారి వద్ద మీకు లోన్ కావాలి అంటే మాకు లాగిన్, ఇన్స్యూరెన్స్, లీగల్ సెక్యూరిటీకి సంబంధించి రూ.60వేలు, నుంచి రూ.80వేలు ముందుగా చెల్లించాలని చెప్పి వారి నుంచి కట్టించుకున్నారు. ఏడాది గడుస్తున్నా ఇంకా రుణం మంజూరుకాకపోవడంతో నువ్వే కదా మా నుంచి దరఖాస్తులు తీసుకుంది, మా డబ్బులు మాకు ఇవ్వమని నాపై ఒత్తిడి చేస్తున్నారు. సదరు కంపెనీ వారికి డబ్బులు ఇవ్వమని ఎన్నోసార్లు ఫోన్, మెయిల్ చేసినా స్పందించట్లేదు.. దీంతో మోసం చేశారని గ్రహించి ఫిర్యాదు చేస్తున్నాను. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని ఆ డబ్బులు తిరిగి ఇప్పించగలరు.

– ముంద్రు శివప్రసాదు, నరసరావుపేట

నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలి



స్టేషన్‌రోడ్డు గాంధీపార్కు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం(ఏఐకేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ మార్కెటింగ్ విధానాన్ని వ్యతిరేకిస్తూ అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్టేషన్‌రోడ్డులోని గాంధీ పార్క్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జీఓ కాపీలు దహనం చేశారు. ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు అధ్యక్షతన నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ప్రసాద్ మాట్లాడుతూ 13 నెలలు పోరాటంతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలు ఉపసంహరించుకుంటున్నామని చెప్పిన వారు, నేడు దొడ్డిదారిన జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం పేరుతో వ్యవసాయం మొత్తాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పే ప్రయత్నం చేయడం రైతులను వంచించటమేనని విమర్శించారు. కౌలు రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ స్వామినాథన్ సిఫారసులు ప్రకారం గిట్టుబాటు ధరల చట్టం చేయాలని, కేరళ తరహాలో రుణమాఫీ చట్టం చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రెడ్ బాషా, పీడీఎం రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఉలవపూడి రాము, అధ్యక్షులు గుంటుపల్లి బాలకృష్ణ, నల్లపాటి రామారావు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం..

ఈ మేరకు గత 26 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు దల్లేవాలు ప్రాణాలు కాపాడాలని, ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్న రైతులపై అణచివేతను ఆపాలని, అక్రమంగా నిర్బంధించిన నోయిడా, గ్రేటర్ నోయిడా రైతులందరినీ లక్సర్ జైలు నుంచి తక్షణమే విడుదల చేయాలని, కేరళ తరహాలో రుణమాఫీ చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ అరుణ్ బాబుకు వినతి పత్రం అందజేశారు.

అవిశ్రాంత సాహితీ శ్రామికుడు 'పెనుగొండ'

గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఘనసత్కారం



పెనుగొండ లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న కవి పాపినేని శివశంకర్, కేఎస్ లక్ష్మణరావు, సత్యాజీ, డొక్కా, పాశం రామారావు

లక్ష్మీపురం: అవిశ్రాంత సాహితీ శ్రామికుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అని, ఆయనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కడం గర్వకారణమని అభ్యుదయ కవి పాపినేని శివశంకర్ అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అధ్యక్షతన గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం, సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో అభినందన సభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పాపినేని శివశంకర్ మాట్లాడుతూ పెనుగొండకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కడం రాష్ట్రానికి, గుంటూరు సీమకు గర్వకారణమన్నారు. గత 40 ఏళ్లుగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో సాహిత్య రంగంలో అనేక పెడధోరణలు వ్యక్తమవుతూ కలుషితమవుతున్న నేపథ్యంలో అభ్యుదయ సాహిత్యానికి గుర్తింపు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పెనుగొండ లక్ష్మీనారాయణ ఇటీవల రాసిన గుంటూరు సీమ సాహిత్య చరిత్ర అనే గ్రంథంలో అనేక విషయాలు వెల్లడించారన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యాజీ మాట్లాడుతూ పెనుగొండ లక్ష్మీనారాయణకు దక్కిన అవార్డు కష్టజీవులకు వచ్చిన అవార్డేనని అభ్యుదయ సాహిత్యానికి లభించిన గుర్తింపన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా పుట్టిన గడ్డ, అనేక అభ్యుదయ, ప్రజా ఉద్యమాలకు పుట్టినిల్లుగా వున్న వినుకొండలో జన్మించడం వల్ల జాషువా ప్రభావం కూడా పెనుగొండపై ఉందన్నారు. అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అభ్యుదయ రచయితల సంఘం, ప్రజానాట్య మండలి సాంస్కృతిక పునరుజ్జీవనానికి, సాహిత్య సాంస్కృతిక రంగాలలో కమ్యూనిస్టు పార్టీ గొప్ప కృషి చేసిందని చెప్పేందుకు గర్వపడుతున్నామన్నారు. అభ్యుదయ రచయితల సంఘం మూలాలను పరిశీలిస్తే పేదల సమస్యల పరిష్కారం, అభ్యుదయ భావజాలాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లడమేనని, తనకు దక్కిన పురస్కారం సమాజానికి దక్కడమేనన్నారు. గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు మాట్లాడారు. విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎంకాళిదాసు, విప్లవ రచయితల సంఘం నాయకుడు సి.యస్.ఆర్. ప్రసాద్, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

ఓపీ కష్టాలకు ఇక చెల్లు చీటీ!

జీజీహెచ్‌లో అదనంగా ఏడు ఓపీ కౌంటర్లు సిద్ధం



ప్రారంభానికి సిద్ధమైన నూతన ఓపీ కౌంటర్లు



డాక్టర్ యశశ్వి రమణ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స కోసం వచ్చే రోగులు తప్పనిసరిగా మొదటగా అవుట్ పేషెంట్ విభాగంలో ఓపీ చీటి తీసుకోవాల్సి ఉంటుంది. ప్రతిరోజూ జీజీహెచ్‌కు ఏడు జిల్లాల నుంచి సుమారు 2,500 మంది రోగులు ఓపీ విభాగానికి వస్తుంటారు. ఓపీ చీటీ తీసుకోవడానికి రోగులకు గంటకుపైగా సమయం పడుతోంది. ప్రస్తుతం ఆసుపత్రిలో పది ఓపీ కౌంటర్లు ఉన్నాయి. అదనంగా కౌంటర్లు ఏర్పాటు చేయడం ద్వారా ఓపీ చీటీలు త్వరితగతిన రోగులకు అందించే వీలుకలుగుతోంది. ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా గతనెలలో బాధ్యతలు చేపట్టిన డాక్టర్ యశశ్వి రమణ తొలుత ఆసుపత్రిలో వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించి కొంత మేరకు సమస్యను పరిష్కరించారు. అనంతరం ఓపీ కౌంటర్ల వద్ద రద్దీగా ఉండటాన్ని గమనించి అదనంగా ఓపీ కౌంటర్లు ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఏడు ఓపీ కౌంటర్లను నూతనంగా నిర్మించారు. త్వరలోనే ఓపీ కౌంటర్లు ప్రారంభిస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ తెలిపారు. ఓపీ కౌంటర్లలో చీటీలు రోగులకు త్వరగా అందేలా చేయడంతోపాటుగా, సాహో జీజీహెచ్ కార్యక్రమంలో భాగంగా పలువురు వలంటీర్లను సైతం జీజీహెచ్‌లో అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. రోగులు ఓపీ చీటి తీసుకున్న తరువాత ఓపీకి ఎక్కడికి వెళ్లాలి, ఏవిధంగా వెళ్లాలి, ల్యాబ్‌లు, స్కానింగ్ కేంద్రాలు ఇతర వైద్య పరీక్షలు ఎక్కడా చేస్తారనే విషయాలను రోగులకు దగ్గరుండి సాయం చేసేందుకు వలంటీర్లు తమవంతు కృషి చేస్తారని వెల్లడించారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వలంటీర్లుగా పనిచేసేందుకు ముందుకు వచ్చారన్నారు. ఓపీ కౌంటర్లలో రోగుల సహాయకులు వేచి యుండేందుకు సైతం దాతల సహాయంతో బల్లలు ఏర్పాటు చేయడంతోపాటు, ప్రత్యేకంగా వెయిటింగ్ హాలును నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, జీజీహెచ్ హెచ్‌డీఎస్ కో కన్వీనర్ నసీర్ అహ్మద్, జిల్లా కలెక్టర్, హెచ్‌డీఎస్ చైర్మన్ నాగలక్ష్మి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు సహాయ సహకారాలతో జీజీహెచ్‌లో పేద రోగులకు కార్పొరేట్ వైద్య సేవలు ఉచితంగా అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.

హెల్మెట్ లేకుంటే యమ డేంజర్!

హెల్మెట్ ధారణపై యముడి వేషధారణలో వినూత్న ప్రచారం



హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పట్నంబజారు: హెల్మెట్ అనేది ప్రతి ఒక్కరికీ ప్రాణాపాయ పరిస్థితుల్లో రక్షణ కవచం వంటిదని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ చెప్పారు. సోమవారం ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలోని ట్రాఫిక్ సీఐ ఎ.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో హిందూ కళాశాల కూడలి ప్రాంతంలో హెల్మెట్‌పై స్పెషల్ డ్రైవ్ జరిగింది. దానిలో భాగంగా యమధర్మరాజు వేషధారణలో వ్యక్తి హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో జిల్లా సతీష్‌కుమార్ స్వయంగా హాజరై అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో అధికంగా తలభాగానికి గాయాలు అవడం వల్లే మృత్యువాత పడుతున్నారని తెలిపారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే యమధర్మరాజు మీ వెంటనే ఉంటాడన్న సందేశాన్ని తెలియజేసేలా ఆసక్తికరంగా అవగాహన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏఎస్పీ ఎ.హనుమంత్, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

ప్రతి పైసాకు బాధ్యత వహించాలి

నీటి యాజమాన్య సంస్థ జిల్లా పీడీ ఎం.సిద్ధలింగమూర్తి



ప్రజావేదికలో ఎం.సిద్ధలింగమూర్తి, విజిలెన్స్ అధికారి విజయకుమారి

రెంటచింతల: గ్రామాలలో చేపట్టిన వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించి క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి పైసాకు బాధ్యత వహించాల్సిఉంటుందని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జిల్లా నీటియాజమాన్య సంస్థ ఎం.సిద్ధలింగమూర్తి అన్నారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద 16వ విడతకు సంబంధించి నిర్వహించిన సామాజిక తనిఖీ-ప్రజా వేదికకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో గ్రామాలలో చేసిన ఉపాధి హామీ పథకం పనులు, పంచాయిరాజ్ శాఖ, హౌసింగ్ అంశాలపై గ్రామాలలో ఈ నెల 16 నుంచి 22 వరకు క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. తనిఖీలలో మండలంలోని 11 గ్రామాలకు సంబంధించి మొత్తం రూ. 1,07,824 రికవరీ చేయడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా విజిలెన్స్ అధికారి విజయకుమారి, ఎంపీడీఓ కె.సరోజినిదేవి, ఎస్ఆర్పీ జేఎస్ రాజు, ఏపీఓ జయచంద్ర కుమార్, సర్పంచ్ గొట్టం ప్రమీల గురవారెడ్డి, కార్యదర్శులు, ఉపాధి, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

నేటి విద్యార్థులకు ప్రేరణ 'గోల్డెన్ డేస్..'

పుస్తకావిష్కరణలో రెవ.ఫాదర్ పీటర్ పాపయ్య



పుస్తకావిష్కరణ చేస్తున్న ఫాదర్ పీటర్ పాపయ్య, మధ్యప్రదేశ్ విశ్రాంత డీజీపీ బి.మరియ కుమార్

రెంటచింతల: తన చిన్ననాటి జ్ఞాపకాలతో కూడిన అందమైన అనుభవాలను మరియకుమార్ గోల్డెన్ డేస్ ఆఫ్ గ్రోయింగ్ ఆప్ పుస్తకంగా మలిచారని స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ రెవ.ఫాదర్ ఎస్.పీటర్ పాపయ్య అన్నారు. సోమవారం పాఠశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి మధ్యప్రదేశ్ మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.మరియకుమార్ రచించిన గోల్డెన్ డేస్ ఆఫ్ గ్రోయింగ్ అప్ పుస్తకాన్ని ఆయన పాఠశాల పూర్వ విద్యార్థి, విశ్రాంత హెచ్ఎం తుమ్మా లూర్దు మర్రెడ్డి, తోటి మిత్రులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. రెంటచింతల గ్రామానికి చెందిన మండి మరియకుమార్ ఈ పాఠశాలలో 1968 నుంచి 1973 వరకు విద్యాభ్యాసం చేసిన రోజుల్లో పాఠశాలలో నున్న ప్రత్యేకతలను, గ్రామ జీవన శైలిని చక్కగా వివరిస్తూ ఆనాటి తన మధురమైన జ్ఞాపకాలను ఈ పుస్తకంలో పంచుకున్నారన్నారు. ఈ పుస్తకం నేటి విద్యార్థులకు, భవిష్యత్ తరాల బాలబాలికలకు వ్యక్తిత్వ వికాసానికి ప్రేరణగా నిలుస్తుందన్నారు. అనంతరం మరియకుమార్‌ను ఘనంగా సన్మానించారు. విశ్రాంత హెచ్ఎం తుమ్మా లూర్దు మర్రెడ్డి, కొండసాని ఆంజనేయరెడ్డి, జంగం దేవదాస్, మున్నా లింగమూర్తి, ఖండే వెంకట ప్రభాకర్ రావు, సోమసాని పేరిరెడ్డి, కంపా ఫ్రాన్సీస్, ఎలిజాల సెబాస్టియన్, జక్కిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, పగడాల మరియన్న, మర్రి ఫిలోమెన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నల్లచట్టాలను దొడ్డిదారిన తేవాలనుకోవడం దుర్మార్గం

- కేంద్రం తెచ్చిన నూతన బిల్లును రద్దు చేయాలని కోరుతూ రైతు సంఘాల నేతల నిరసన



వ్యవసాయ మార్కెటింగ్ నూతన బిల్లు పత్రాలను దహనం చేస్తున్న రైతు సంఘం నాయకులు

లక్ష్మీపురం: రైతాంగ పోరాట ఫలితంగా మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు పరిచిన ప్రధాని నరేంద్ర మోదీ ఇదే చట్టాలను దొడ్డిదారిన వివిధ పేర్లతో మళ్లీ యావత్తు రైతాంగాన్ని దెబ్బతీసే విధంగా తీసుకురావడం చాలా దుర్మార్గమని జిల్లా రైతు సంఘం కార్యదర్శి కంచుమాటి అజయ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి అన్నారు. జాతీయ అగ్రికల్చర్ మిషన్ పేరుతో వ్యవసాయ మార్కెటింగ్‌ను దెబ్బతీసే విధంగా నూతన బిల్లు కాపీని గుంటూరు కలెక్టరేట్ ముందు సోమవారం రైతు, కార్మిక, ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో దహనం చేసి, నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులను కార్పొరేటర్ పరం చేసేందుకు 'నేషనల్ పాలసీ ఫ్రేమ్ వర్క్ ఆన్ అగ్రికల్చర్ మార్కెటింగ్' పేరుతో పెద్ద కుట్రతో నూతన చట్టాన్ని కేంద్రం తీసుకొచ్చిందన్నారు. వీటిని ఉపసంహరించుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు ఉల్లిగడ్డ నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు పాశం రామారావు, జొన్న శివశంకర్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు జగన్నాథం, కృష్ణ, విటల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఆహారంతోనే ఆరోగ్యం



పురస్కార గ్రహీతలతో డీజీపీ ద్వారకా తిరుమలరావు, ఏపీ వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తదితరులు

- డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు
- రైతునేస్తం ఫౌండేషన్ మిద్దెతోటల పురస్కారాలు ప్రదానం

గుంటూరు రూరల్: సేంద్రియ ఆహారంతోనే ఆరోగ్యంగా జీవించవచ్చని ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు తెలిపారు. సోమవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తుమ్మేటి రఘోత్తమరెడ్డి రైతునేస్తం మిద్దెతోటల పురస్కారాలు-2024 కార్యక్రమంలో డీజీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పాల్గొనటం సంతోషకరమన్నారు. ఇంట్లో మొక్కలు పెంచుకునే వారికి ప్రభుత్వం తరపు నుంచి ప్రోత్సాహకాన్ని అందించడానికి తన వంతు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. పురస్కారాలు అందుకున్న వారందరికీ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రముఖ మిద్దెతోట నిపుణులు తుమ్మేటి రఘోత్తమరెడ్డి, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీవీఐటీ వార్షికోత్సవం



ప్రతిభ చూపిన విద్యార్థినులకు షీల్డ్ అందజేస్తున్న వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్



విద్యార్థులకు షీల్డ్ అందజేస్తున్న వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: వీవీఐటీలో సంపూర్ణ క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తున్నట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల 17వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం మనసులను హత్తుకుంది. చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ సంపూర్ణ క్రమశిక్షణ, సంపూర్ణ విద్య నినాదంతో విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. కళాశాల విద్యార్థులు అన్నిరంగాలలో రాణించి విజేతలుగా ఎదగడం సంతోషం కలిగించినదన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల సంఘం ద్వారా ప్రస్తుత విద్యార్థుల భవిష్యత్ ప్రణాళికలకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లిఖార్జునరెడ్డి 2023-24 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్‌ను అందచేశారు. ఈవిద్యాసంవత్సరంలో మెరుగైన ఉత్తీర్ణతా శాతాన్ని సాధించిన విభాగంగా కంప్యూటర్ సైన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్(సీఎస్ఎం), అకడమిక్స్ టాపర్‌గా విద్యాయేతర (క్రీడ, సాంస్కృతిక) అంశాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విభాగం కంప్యూటర్ సైన్స్- ఐఓటీ అండ్ సైబర్ సెక్యూరిటీ విత్ బ్లాక్‌చైన్ టెక్నాలజీ (సిఐసి) రోలింగ్ షీల్డ్‌లను దక్కించుకున్నాయి.